సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 25, ఫిబ్రవరి, 2025



సోమశిలలో 60.299 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 60.299 టీఎంసీల నీరుంది. వివిధ కాలువలకు 3,830 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.89,450
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,089
3శాతం జీఎస్టీతో	రూ.8,332
నవర (8గ్రా)	రూ.66,656

గరిష్టం/కనిష్టం
33.6 /24.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 64 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఇళ్ల ముందు కంచెపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు వెంకట్రావుపల్లి తూర్పువీధిలో రాజకీయ కక్షలతో వైఎస్సార్‌సీపీకి చెందిన వారి ఇళ్లకు వెళ్లే దారిలో టీడీపీ వర్గీయులు కంచె వేసిన విషయంపై సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఆత్మకూరు ఆర్డీఓ బి పావని స్పందించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి విచారణ చేయాలని డిప్యూటీ తహసీల్దారు స్వరూప్‌ను, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, కక్షలు పెంచుకోరాదని ఆమె సూచించారు.

ఐటీడీఏ పీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఐటీడీఏ ప్రాజెక్ట్ పీఓగా బి.మల్లికార్జున్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. దర్గామిట్టలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆయనను ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరిమళ, ఏపీఓ రమణయ్య, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

పెట్రోలు బంకుల్లో తనిఖీలు



బుచ్చిరెడ్డిపాళెంలోని పెట్రోలు బంకులో తనిఖీ

నెల్లూరు (పొగతోట), నెల్లూరు(క్రైమ్): జిల్లాలో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, పౌరసరఫరాల శాఖాధికారులు సంయుక్తంగా పెట్రోలు బంకుల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో బుచ్చిరెడ్డిపాళెం, ముత్తుకూరు పెట్రోలు బంకులపై 6ఏ కేసులు నమోదు చేశారు. కందుకూరులోని ఎస్‌వీఎస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో 5లీటర్లకు 40 ఎంఎల్ తేడా ఉండడంతో కేసు నమోదు చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలో 2, ముత్తుకూరులో 1 పెట్రోలు బంకుల్లో రికార్డు నిర్వహణలో తేడాలు ఉన్నాయి. మొత్తం పెట్రోలు, డీజిల్ కలిపి రూ.32,77,664 విలువ చేసే పెట్రోలు, డీజిల్‌ను అధికారులు సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నర్సింహారావు, శ్రీహరిరావు, సుభానీ, వేణుగోపాల్‌రావు, డీఎస్‌ఓ అంకయ్య, లీగల్ మెట్రాలజీ అధికారులు కరిముల్లా, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.


భూములు ఇవ్వాలంటే కష్టమే



రామాయపట్నంలో ప్రజాభిప్రాయ సేకరణ

ఉలవపాడు: బీపీసీఎల్ కంపెనీకి భూములు ఇవ్వడం తమకు ఇష్టం లేదని గ్రామస్తులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. రాష్ట్ర చేనేత జనసమాఖ్య మానవ హక్కుల వేదిక సంస్థలు సోమవారం మండల పరిధిలోని రామాయపట్నం, చాకిచర్ల, పెదపట్టపుపాళెం గ్రామాల్లో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టాయి. బీపీసీఎల్ కోసం 6000 ఎకరాలు తీసుకుంటున్నారన్న కథనాలు రావడంతో అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ప్రజల నుంచి భూసేకరణకు వ్యతిరేకత ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జనసమాఖ్య నాయకులు మాచర్ల మోహనరావు, రాజేష్, కృష్ణ, మానవ హక్కుల నాయకుడు రోహిత్ పాల్గొన్నారు.

వచ్చేసింది పరీక్షా సమయం



విద్యార్థులకు పరీక్షా సమయం ముంచుకువస్తోంది. వరుస పరీక్షల నేపథ్యంలో ఆయా కోర్సులు చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయం ఆసన్నమైంది. రానున్న 4 నెలల కాలం పరీక్షలకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాల్సిన సమయం. ఓ వైపు ఆయా కోర్సులు బోధిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇప్పటికే సిలబస్‌ను పూర్తి చేసి రివిజన్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరో వైపు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించే దిశగా ఆయా ప్రైవేటు యాజమాన్యాలు తమ విద్యార్థుల మెదడుకు పదును పెట్టే పనిలో ఉన్నారు.



పరీక్షలకు హాజరైన డిగ్రీ విద్యార్థులు

నెల్లూరు (టౌన్): వచ్చేనెల 1వ తేదీ నుంచి జూన్ నెల వరకు వరుసగా పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్‌తో ప్రారంభమయ్యే పరీక్షలు ఆయా కోర్సులకు నిర్వహించే ప్రవేశ పరీక్షలతో ముగియనున్నాయి. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నారు. మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రెండో విడత జేఈఈ మెయిన్ పరీక్ష జరగనుంది. ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను మే 18న నిర్వహించనున్నారు. ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ మే 4వ తేదీన నిర్వహించనున్నారు. మే 19 నుంచి 27 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలను నిర్వహించనున్నారు. అదే విధంగా డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 5 నుంచి 2వ సెమిస్టర్ ఏప్రిల్ 8 నుంచి ప్రారంభం కానున్నాయి. వీటితో పాటు మే 2 నుంచి 5వ తేదీ వరకు ఏపీ ఆర్‌సెట్ (పీహెచ్‌డీ), మే 6న ఏపీ ఈసెట్, మే 7న ఏపీ ఐసెట్, మే 25న లాసెట్, జూన్ 5 నుంచి 7 వరకు పీజీ ఈసెట్, జూన్ 8న ఎడ్‌సెట్, జూన్ 9 నుంచి 13 వరకు పీజీ సెట్, జూన్ 25న పీఈసెట్ పరీక్షలు జరగనున్నాయి. అదే విధంగా డీఎస్సీ పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది.

పరీక్షలకు 1.60 లక్షల మంది విద్యార్థులు

వరుస పరీక్షలకు జిల్లా నుంచి ఆయా కోర్సులు చదువుతున్న విద్యార్థులు దాదాపు 1.60 లక్షల మంది హాజరవుతారని అంచనా. వీరంతా ఆయా పబ్లిక్ పరీక్షలతో పాటు పోటీ పరీక్షలకు హాజరుకానున్నారు. పదవ తరగతికి సంబంధించి రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 29 వేలు, ఇంటర్‌కు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కలిపి మొత్తం 54వేల మంది హాజరుకానున్నారు. అదే విధంగా డిగ్రీకి సంబంధించి 40 వేల మంది, ఇంజినీరింగ్‌కు సంబంధించి 4 సంవత్సరాలు కలిపి 20 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షలతో పాటు బీఈడీ, లాసెట్, ఎడ్ సెట్, పీజీ సెట్, డీఎస్సీ తదితర పరీక్షలకు కూడా హాజరుకానున్నారు.

తల్లిదండ్రుల్లో ఆందోళన

ఓ వైపు వరుస పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతుండగా మరో వైపు వచ్చేనెల 22 నుంచి ఇండియన్ ప్రైమరీ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఐపీఎల్ దాదాపు 40 రోజుల పాటు నిర్వహిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. పరీక్షల సమయంలో ఐపీఎల్ ప్రారంభం కానుండటంతో తమ పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతారేమోనన్న భయం ఉంది. వేలు, లక్షల్లో ఫీజులు చెల్లించి ఏడాది మొత్తం కష్టపడి చదివించిన పిల్లలు ఐపీఎల్ మోజులో పడతారేమోనని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం

ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. పరీక్షలతో పాటు ఏపీ ఈఏపీ సెట్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్ డ్, నీట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు బోధిస్తున్నాం. ఇప్పటికే సిలబస్‌ను పూర్తి చేసి రివిజన్ చేస్తున్నాం. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం.

– మధుబాబు, డీవీఈఓ

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం

పదో తరగతిలో సిలబస్‌ను పూర్తి చేసి రివిజన్ చేస్తున్నాం. ప్రతిరోజు ఒక సబ్జెక్టు పరీక్ష నిర్వహించి ఫలితాల్లో కొంత వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వారి సందేహాలను నివృత్తి చేసేందుకు సబ్జెక్టు టీచర్లను పూర్తిస్థాయిలో నియమించాం. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

– ఆర్.బాలాజీరావు, డీఈఓ

రూ.వంద కోట్ల ఇసుక దోపిడీకి సోమిరెడ్డి స్కెచ్

- అధికారులను బెదిరించి మరీ దోచుకుంటున్నారు
- పూడికలు తీయకుండానే బిల్లులు చేసుకున్నారు
- సర్వేపల్లిలో అనధికార బార్లను నిర్వహిస్తున్నారు
- అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.వంద కోట్ల ఇసుక అక్రమ రవాణాకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్కెచ్ వేశారని అనేక సార్లు తాను చెప్పానని, నేడు అదే విషయం రుజువైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమిరెడ్డి మాత్రం తమది జమీందారి కుటుంబమని, అంతటి గొప్పవంశానికి చెందిన నేనా అవినీతికి పాల్పడేది? అంటూ సోషల్ మీడియాలోనూ, న్యూస్ ఛానల్స్‌లోనూ మాట్లాడేవారని, కానీ ఆయన మాటలకు జరుగుతున్న పనులు చూస్తే భిన్నంగా ఉన్నాయని అన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా సోమిరెడ్డి అవినీతిని సాక్ష్యాధారాలతో సహా మీడియాకు వివరించారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రకృతి వనరులు దోపిడీకి గురవుతున్నాయని చెప్పారు. ప్రధానంగా సూరాయపాళెం ఇసుక రీచ్ నుంచి రూ.వంద కోట్లు దోపిడీకి సోమిరెడ్డి స్కెచ్ వేశారన్నారు. ఇటీవల జిల్లా మైనింగ్ అధికారి విరువూరు వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీ, టిప్పర్లను పట్టుకున్నారని చెప్పారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఓ వ్యక్తి సోమిరెడ్డికి ఫోన్ చేసి జరుగుతున్న విషయాన్ని చెప్పడంతో మీరెందుకు అక్కడికి వెళ్లారని అధికారులను ఫోన్‌లోనే సోమిరెడ్డి బెదిరించారన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడకుంటే అధికారులను బెదిరించాల్సిన అవసరం సోమిరెడ్డికి ఎందుకు వచ్చిందని కాకాణి ప్రశ్నించారు. ఆయా ఇసుక రీచ్‌ల సమీపంలోని పొలాలకు వెళ్లే దారులు ఉంటే వాటికి గండికొట్టి ధ్వంసం చేసి తాము ఏర్పాటు చేసిన దారిలోనే వెళ్లాలంటూ హుకుం జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిని బట్టి చూస్తుంటే సోమిరెడ్డి విచ్చలవిడి ఇసుక దోపిడీ తెలుస్తోందన్నారు. ఇసుక అక్రమ రవాణాపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఇప్పుడు ధైర్యం ఉంటే సోమిరెడ్డి వాటిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సర్వేపల్లికి తాను గతంలో ఎమ్మెల్యేగానూ, రాష్ట్ర మంత్రిగానూ పనిచేశానని.. నీలాగా అధికారులను బెదిరించడం, ఇసుక అక్రమ రవాణా, దోపిడీ వంటివి ఎన్నడూ చేయలేదన్నారు. ఇరిగేషన్‌కు సంబంధించి కాలువల్లో పూడికలు తీయకుండానే బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. దీనివల్ల పొలాలకు నీరు చేరక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అనధికార బార్లను నిర్వహిస్తున్నారని ఈ విషయాన్ని తాను గతంలోనే చెప్పానన్నారు. సోమిరెడ్డి అవినీతి, అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీలు ఉన్నా లేనట్టుగా ఉందన్నారు. నియోజకవర్గంలో లేఅవుట్ వేస్తే ఎకరాకు రూ.5లక్షలు సోమిరెడ్డికి సమర్పించుకోవాలని, నెల్లూరు కార్పొరేషన్‌కు సమీపంలో ఉన్న ప్రాంతాల్లోనైతే ఎకరాకు రూ.10లక్షలు ఇచ్చుకోవాలని ఇలా వసూలు చేస్తూ ఉన్న సోమిరెడ్డి.. తనను ఇబ్బంది పెట్టాలని అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతికి పాల్పడిన ఏ ఒక్క అధికారిని కూడా విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు.

చికెన్ విక్రయం చితికిపోయింది

- బర్డ్‌ఫ్లూ భయంతో తగ్గిన వినియోగం
- గతంలో సాధారణ రోజుల్లో నిత్యం 30 వేల నుంచి 40 వేల కేజీల విక్రయాలు
- ప్రస్తుతం 10 వేల కేజీలకు పరిమితం

నెల్లూరు(సెంట్రల్): బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ వాడకాన్ని వినియోగదారులు తగ్గించడంతో చికెన్ విక్రయదారులు, పౌల్ట్రీ నిర్వాహకులు నష్టాలు చవిచూస్తున్నారు. ఇటీవల కాలంలో ఉభయగోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వెలుగులోకి రావడం... ఆరు నెలల క్రితం జిల్లాలోనూ ఈ వ్యాధి కలకలం సృష్టించడం తెలిసిందే. తాజాగా గోదావరి జిల్లాల్లో లక్షల్లో కోళ్లు చనిపోతుండడంతో బర్డ్‌ఫ్లూ దెబ్బకి చికెన్ కొనుగోళ్లు బాగా తగ్గిపోయాయి.

విక్రయాలు ఎలా ఉన్నాయంటే..

జిల్లాలో గత నెల వరకు చికెన్ వినియోగం బాగానే ఉండేది. వ్యాపారాలు కూడా జోరుగానే సాగేవి. ఇక ఆదివారం వచ్చిందంటే మాంసం ముక్క పళ్లెంలో ఉండాల్సిందే. జిల్లాలో చిన్నా చితకా షాపులతో కలిపి దాదాపు 5 వేలకు పైగా చికెన్ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా సాధారణ రోజుల్లో 30 వేల కేజీల నుంచి 40 వేల కేజీల వరకు విక్రయాలు జరుగుతుంటాయి. ఆదివారం ఒక్క రోజే 80 వేల నుంచి లక్ష కేజీల వరకు విక్రయాలు జరిగేవని చికెన్ వ్యాపారులు చెపుతున్నారు. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ భయంతో సాధారణ రోజుల్లో 10 వేల కేజీలు, ఆదివారాల్లో 35 వేల కేజీల వరకు విక్రయాలు జరుగుతున్నాయని చెపుతున్నారు.

ధరలు తగ్గించినా...

జిల్లాలో చికెన్ ధరలు గత నెల వరకు పైపైకి ఎగబాకే పరిస్థితి ఉండేది. గత నెలలో స్కిన్‌లెస్ బ్రాయిలర్ కేజీ మాంసం రూ.300కి చేరువలో ఉండేది. రెండు వారాల క్రితం వరకు స్కిన్ లెస్ కేజీ రూ.260కి చేరువలో ఉండేది. కాని ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ భయంతో విక్రయాలు తగ్గాయి. దీంతో పౌల్ట్రీ వ్యాపారులు కూడా ధరలు తగ్గించాలని నిర్ణయించి బ్రాయిలర్ స్కిన్‌లెస్ ధర కేజీ రూ.190కి విక్రయాలు చేస్తున్నారు. అయినా వైరస్ భయంతో చాలా వరకు విక్రయాలు తగ్గుముఖం పట్టాయని వాపోతున్నారు.

చర్యలు శూన్యమే...

బర్డ్‌ఫ్లూ దెబ్బకి జిల్లాలోని పౌల్ట్రీరంగంపై తీవ్ర ప్రభావం చూపినా ప్రభుత్వం మాత్రం పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉభయగోదావరి జిల్లాల్లో వెలుగులోకి వచ్చిన తరువాత అన్ని జిల్లాల అధికారులను అప్రమత్తం చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బర్డ్‌ఫ్లూ వెలుగులోకి వచ్చిన తరువాత వెంటనే చర్యలు తీసుకుని ఉంటే కొంత నష్ట నివారణ చేసే అవకాశం ఉండేదని పౌల్ట్రీ వ్యాపారులు వాపోతున్నారు.

వ్యాపారాలు పడిపోయాయి

ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ భయంతో పూర్తిగా వ్యాపారాలు పడిపోయాయి. జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదు. కానీ ఉభయగోదావరి జిల్లాల్లో వెలుగులోకి రావడంతో మన జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుతం పౌల్ట్రీ రంగం తీవ్రమైన నష్టాల్లో ఉంది. ఈ ప్రభావం ఎన్ని రోజులు ఉంటుందో తెలియడం లేదు.

–వెంకట రమణయ్య, బ్రాయిలర్ ఫార్మర్స్ అసోసియేషన్

ప్రజాసమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు (అర్బన్): సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి వచ్చి అర్జీలు అందజేశారు. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల విషయాలు.. వారి మాటల్లోనే...

పేదల భూములను ఆక్రమిస్తున్నారు

మా గ్రామంలో 500 ఎకరాల ఇనాం భూములు 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. 1960లో ఒక ఇనాందారు ముత్తుకూరు మండలంలోని మెట్టా రాజగోపాల్‌రెడ్డికి 384 ఎకరాలు అమ్మాడు. తర్వాత వచ్చిన సీలింగ్ చట్టం వల్ల ప్రభుత్వం వద్ద కాంపెన్‌జేషన్ పొంది ఈ భూములను కొనుగోలు చేసిన రాజగోపాల్‌రెడ్డి వదులుకున్నాడు. అనంతరం అప్పటి తహసీల్దార్ 110 ఎకరాలను పేదలకు పట్టాగా ఇచ్చారు. వాటిని నిరుపేదలు సాగుచేసుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం మెట్టా రాజగోపాల్‌రెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆ పొలాలు తనవే అంటూ అధికారుల ద్వారా చర్యలకు ఉపక్రమించారు. తాజాగా మరో కొత్త వ్యక్తి రాచమల్లు రమేష్ ఆ భూములు తనవే అంటూ అధికార పార్టీ నేతల ద్వారా ఆక్రమిస్తున్నాడు. ఇప్పటికే 20 ఎకరాలు ఆక్రమించడమే కాకుండా గ్రామంలో రోడ్డును సైతం ఆక్రమించాడు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపి పేదలకు ఆ భూముల్లో పట్టాలు ఇవ్వాలి.

– ఎన్వీ రమణయ్య, రవీంద్ర, పెంచలయ్య, మట్టెంపాడు గ్రామస్తులు
– పి.జనార్దన్, తిరుపాలు సీపీఎం నాయకులు

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధిని పునఃప్రారంభించాలి

చట్టబద్ధమైన భవన నిర్మాణ సంక్షేమనిధి నిధులు డైవర్ట్ చేశారు. జిల్లాలో 40వేలకు పైగా కార్మికుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. డైవర్ట్ అయిన నిధులతో సంక్షేమనిధిని పునః ప్రారంభించి కార్మికులను ఆదుకోవాలి.

– నరసింహాచారి, మహమ్మద్, నాగరాజు, ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ యూనియన్

అరుంధతీయుల భూములు ఆక్రమించారు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): రూరల్ మండల పరిధిలోని ఆమంచర్ల గ్రామంలో అరుంధతీయుల ఇళ్ల స్థలాలను ఆక్రమించడం తగదని నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థలాలు ఆక్రమించిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో రెవెన్యూ అధికారులు అర్హులైన 23 మందికి ఒక్కొక్కరికి 9 అంకణాల చొప్పున నివేశన స్థలాలు పట్టాలుగా ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన స్థానిక నేతలు వేణుగోపాల్‌నాయుడు, వాకా వెంకటేశ్వర్లు పేదలకు ఇచ్చిన లేఅవుట్‌ను దున్నేసి, హద్దురాళ్లు పీకేసి చుట్టూ ఫెన్సింగ్ వేసుకుని ఆక్రమించారని పేర్కొన్నారు. నిరుపేద దళితులకు ఇచ్చిన స్థలాలను ఆక్రమించడం సిగ్గుచేటన్నారు. కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆమంచర్ల బిట్–2 ఎంపీటీసీ సురేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, శివాజీ, సింహాద్రి, దశయ్య, రమణమ్మ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

మురుగు, దోమలతో అల్లాడుతున్నాం

మా ప్రాంతంలో ఎండోమెంట్‌కు చెందిన 2ఎకరాల భూమి పల్లపు ప్రాంతంలో ఉంది. దీంతో అక్కడ మురుగునీరు నిలిచిపోయి దోమలు ఉధృతంగా ఉన్నాయి. దోమల ధాటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అందువల్ల ఎండోమెంట్ స్థలాన్ని మట్టితోలించి చదును చేయించి పార్కు, ఆటస్థలంగా చేయాలి. మురుగు లేకుండా చేసి స్థానికుల ఆరోగ్యాన్ని కాపాడాలి.

– రామకృష్ణ, బాబూరావు, వెంకటరాఘవరెడ్డి, పరమేశ్వరినగర్ వెల్ఫేర్ అసోసియేషన్, నెల్లూరు

ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి

రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది గిరిజనులున్నారు. అందులో 30 శాతం యానాదులున్నారు. అయితే విద్య, వైద్య, రాజకీయంగా యానాదులకు చట్టబద్ధంగా రావాల్సిన సౌకర్యాలు అందడంలేదు. అందువల్ల ఎస్సీల మాదిరిగానే ఎస్టీలకు కూడా వర్గీకరణ చేపట్టి యానాదులకు న్యాయం చేయాలి.

– కేసీ పెంచలయ్య, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలంటూ ర్యాలీ



సీపీఐ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు(అర్బన్): అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్లు చేసిన బాధితులందరికీ నగదు తిరిగి ఇచ్చేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఏజెంట్లు, బాధితులు ర్యాలీ చేసి అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉదయగిరి, వరికుంటపాడు, కలిగిరి, దుత్తలూరు ప్రాంతాల్లో అగ్రిగోల్డ్ కంపెనీ భూముల్లో ఉన్న ఎర్రచందనం, టేకు, ఇతర సంపదను అక్రమార్కులు దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈవీ నాయుడు, తిరుపతిరావు, శేషగిరిరావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీఎస్‌యూకు ఎన్‌ఐఓటీ బృందం



వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావుతో సమావేశమైన ఎన్‌ఐఓటీ ప్రతినిధులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)ని జాతీయ మహా సముద్ర సాంకేతిక సంస్థ (ఎన్‌ఐఓటీ) చెన్నై ప్రతినిధులు డాక్టర్ ఎన్‌వీ వినీత్, డాక్టర్ సచ్చితానందనం, డాక్టర్ ఎన్‌వీఎస్ దేవిరాం సోమవారం సందర్శించారు. వీఎస్‌యూలో మెరైన్ బయోలజీ విభాగం అచార్యులు, పరిశోధకులతో సమావేశమై సముద్ర జీవ వైవిధ్యం, ఉప్పు నీటి పరిశోధనలపై వివిధ అంశాలను చర్చించారు. ల్యాబ్‌లు, తరగతి గదులు, మ్యూజియం సందర్శించి పరిశోధనలపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీతతో సమావేశమై సముద్ర జీవ పరిసరాల అధ్యయనంలో పరిశోధనలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత, జాతీయ స్థాయి సంస్థలతో అనుసంధానంపై చర్చించారు.

ప్రాణహాని ఉందని ఎస్పీకి ఫిర్యాదు

వరికుంటపాడు: మండలంలోని తోటల చెరువుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పులి వెంకటప్రసాద్ తనకు తమ గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత డి.మౌలాలి నుంచి ప్రాణహాని ఉందని సోమవారం నెల్లూరులో ఎస్పీ కృష్ణకాంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నెల 17వ తేదీన కుటుంబ ఆస్తి విషయమై జరిగిన గొడవలో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేకపోయినా.. టీడీపీ నేత మౌలాలి జోక్యం చేసుకొని తమపై దాడికి పాల్పడ్డాడని, పోలీసులు సైతం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, తమ పైనే కేసు నమోదు చేశారని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి స్థాయిలో విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని బాధితుడు తెలిపారు.

ఆక్రమణలన్నీ తొలగించాల్సిందే

రాపూరు : మండలంలోని కండలేరు జలాశయం భూమిని పలువురు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని, అయితే ఇందులో కొంత మందికే రెవెన్యూ అధికారులు ఆక్రమించిన స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చినారని రాంబాబు, శేషుబాబు, వెంకటాద్రి ఆరోపించారు. ఆక్రమణలు తొలగించాల్సి వస్తే.. అందరినీ తొలగించాలని డిమాండ్ చేశారు. కండలేరు జలాశయానికి సంబంధించి 200 ఎకరాల భూమిని ఆ ప్రాంతంలోని పలువురు ఆక్రమించుకుని అనేక ఏళ్లు సాగు చేసుకుంటున్నారు. అందులో అధికార పార్టీకి చెందిన వ్యక్తి కూడా ఉన్నాడు. సదరు వ్యక్తి తన తోటకు వెళ్లేందుకు దారి కోసం అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తేవడంతోనే తమకు నోటీసులు ఇచ్చారని, ఇది ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కొంత మందిపై వివక్ష చూపడం ఏమిటని నిలదీశారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ ఆ ప్రాంత ప్రజల ఫిర్యాదు ఇచ్చారని, ఆ మేరకు ఆక్రమణలో ఉన్న అన్ని భూములను ఖాళీ చేయిస్తామని తెలిపారు.

బైక్ ఢీకొని మేకల కాపరి మృతి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైయినీ డీఎస్పీ, ఎస్‌ఐ

కోవూరు: మేకల కాపరిని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. కోవూరు మండలం వేగూరుకు చెందిన గంధళ్ల శీనయ్య (59) మేకలు మేపుకుంటూ జీవనాధారం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మేకలు తోలుకుని తిరిగి ఇంటికి వస్తుండగా, వేగూరు–మోడేగుంట మార్గంలో మోడేగుంట నుంచి వేగూరుకు వస్తున్న బైకిస్టు అతివేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన శీనయ్యను స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తున్న క్రమంలో సోమవారం మార్గంమధ్యలోనే అంబులెన్స్‌లోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై రంగనాథ్, ట్రైయినీ డీఎస్పీ శివప్రియ సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. శీనయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన శీనయ్య

చారిత్రక ఊరు.. మరుపూరు

1638లోనే కాశీవిశ్వనాథ స్వామి ఆలయ నిర్మాణం

- చెరువులో ప్రాచీన చరిత్ర శాసనం లభ్యం
- అలనాటి శాసనాలు చెల్లా చెదురు
- గ్రామస్తుల చొరవతో వందల ఏళ్లనాటి ఆలయం పునర్నిర్మాణం

ప్రతి ఊరుకు ఓ చరిత్ర ఉంటుంది. అలాంటి ప్రాచీన చరిత్ర కలిగిందే మరుపూరు. చారిత్రక ఆనవాళ్లు చెల్లాచెదురు అవుతున్నాయి. ఆదరణ లేకపోవడంతో కాలగర్భంలో కలిసి పోతున్నాయి. అలనాటి పూర్వీకుల జీవన విధానం, సంప్రదాయాలు, సంస్కృతులను తెలియజేస్తూ అప్పటి రాచరిక ప్రభువులు ఏర్పాటు చేసిన శిలా శాసనాలు, ఆలయాలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. శతాబ్దాలుగా భూగర్భంలో కలిసిపోయిన శిలాశాసనాలు అదృష్టవశాత్తు వెలుగు చూశాయి. వాటి ఆధారంగా ఇంకా మరికొంత చరిత్రను వెలుగులోకి తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ పురావస్తుశాఖ ఆ ప్రయత్నం చేయడం లేదు. దొరికిన ఆధారాలను భద్రపరిచి భవిష్యత్ తరాలకు చూపించే ప్రయత్నం చేయడం లేదు.



శతాబ్దాల నాటి కాశీవిశ్వనాథ వరసిద్ధివినాయకుని దేవస్థానం

పొదలకూరు: శాసనాలు, కట్టడాలు చరిత్ర ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. అయితే పురావస్తుశాఖ నిధుల లేమితో నిస్తేజంగా మారడంతో చారిత్రక సాక్ష్యాలు కాల, భూగర్భంలో కలిసిపోతున్నాయి. మండలంలోని మరుపూరుకు చారిత్రక నేపథ్యం ఉంది. రాపూరు సీమను పాలించిన విజయనగర సామ్రాజ్య వంశస్తులకు సామంతు రాజులైన వెలుగోటి వంశస్తుల (వెంకటగిరి సంస్థానం) కాలంలో మరుపూరు అలనాటి పాలన, సంస్కృతి, సంప్రదాయాలకు చరిత్రగా నిలుస్తోంది. రెండేళ్ల క్రితం చరిత్రకారుడు డాక్టర్ గోవిందు సురేంద్ర ఇందుకు సంబంధించిన చారిత్రక సాక్ష్యాలను కనుగొన్నారు. గ్రామం, చెరువు, దేవస్థానం ఇప్పటికీ అలనాటి చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి. శతాబ్దాల కాలం నాటి నుంచే మరుపూరు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇక్కడ నాగరికతతోపాటు అప్పట్లోనే వరి పండిస్తున్నట్లు ఆ శాసనాల్లో ఉంది. యాదృచ్ఛికంగా చరిత్రకారుడు సురేంద్ర రాతి శాసనాలను పరిశీలించడంతో గ్రామ చరిత్ర, అలనాటి పాలకుల వివరాలు వెలుగులోకి వచ్చాయి. క్రీ.శ. 1638వ సంవత్సరం నాటి రాతి శాసనాలు చెరువుకు సమీపంలో బయల్పడ్డాయి. ప్రాచీన తెలుగు భాషలో శాసనాలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో కాలగర్భంలో కలిసిపోయే అవకాశం ఉంది.

దేవస్థానం పునర్నిర్మాణం

మరుపూరులో క్రీ.శ.1638లో దక్షిణాభిముఖంగా చెరువుకు సమీపంలో నిర్మించిన శ్రీకాశీవిశ్వనాథ స్వామి, వరసిద్ధి వినాయకుని దేవస్థానం శిథిలావస్థకు చేరడంతో గ్రామ పెద్దలు విశిష్టత కలిగిన దేవస్థానం పునర్నిర్మాణ పనులను చేపట్టారు. దాతల సహకారంతో సుమారు రూ.1.50 కోట్ల అంచనాలతో శ్రీమల్లికార్జున కామాక్షితాయి ఆలయంగా నామకరణం చేసి నిర్మించారు. తూర్పు ముఖంతో ఆలయాన్ని నిర్మించడం వల్ల ప్రతినిత్యం సూర్య కిరణాలు గర్భగుడిని తాకుతున్నాయి. ఇది అరుదైన విషయంగా చెప్పుకుంటున్నారు.

చారిత్రక ఆధారాల కోసం పరిశోధించాలి



పురావస్తుశాఖ ఇక్కడ పరిశోధిస్తే శతాబ్దాల చారిత్రక ఆధారాలు వెలుగుచూసే అవకాశం ఉంది. అలనాటి దేవస్థానం, శాసనాల వివరాలు బయటపడతాయి. రాతి శాసనాలను భవిష్యత్ తరాలకు తెలిజేస్తూ భద్రపరచాల్సిన అవసరం ఉంది. ఆలయాన్ని భక్తులు, దాతల సహకారంతో నిర్మించాం.

– వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామపెద్ద, మరుపూరు

ఎంతో విలువైన శాసనాలు

మరుపూరులో రాతి శాసనాలను గుర్తించాం. ఈ శాసనాలు ఎంతో విలువైనవిగా చెప్పుకోవచ్చు. ఇలాంటి శాసనాలు చాలానే ఉన్నాయని మేము గుర్తించాం. ఇలాగే వదిలేస్తే ఇవి కాలగర్భంలో కలిసిపోతాయి. పురావస్తుశాఖ అధికారులు స్పందించి అలనాటి శాసనాలను భద్రపరిచాల్సి ఉంది.

– జీ సురేంద్ర, చరిత్రకారుడు, నెల్లూరు

రాళ్లలో కలిసిపోయిన శాసనాలు



చెరువుకు సమీపంలో లభ్యమైన ప్రాచీన రాతిశాసనం



దేవస్థానంలో ఏర్పాటు చేసిన శాసనం

గ్రామ చెరువుకు సమీపంలో రాతి శాసనాలు చాలా కాలంగా రాళ్లలో కలిసిపోయాయి. గ్రామానికి చెందిన పెద్దలు వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వళ్లూరు గోపాల్‌రెడ్డి రాళ్లలో ఉన్న శాసనాలను గుర్తించి చరిత్రకారులతో పరిశీలన చేయడంతో ఆ శాసనాల ద్వారా చరిత్ర వెలుగులోకి వచ్చింది. వెంకటపతిరాయుడి కాలంలోనే మరుపూరులో చెరువు సమీపంలో శ్రీకాశీవిశ్వనాథ, వినాయకస్వామి ఆలయాలు నిర్మించారని రాతి శాసనం ద్వారా తెలుస్తోంది. నాటి గ్రామస్తులు పండించే పంటలో మేర భాగం అందజేయాలని కాపు, కరణం ఆదేశాలు ఇస్తున్నట్టుగా శాసనం ఉన్నందున రాతి శాసనాన్ని ధానధర్మ శాసనంగా వ్యవహరించే వారని తెలుస్తోంది. ఇదే అంశాన్ని మైసూరు పురావస్తు శాసన పరిశోధకుడు డాక్టర్ మునిరత్నంరెడ్డి ధ్రువీకరించినట్లు గ్రామ పెద్దలు వెల్లడించారు.

మోసగాళ్లపై చర్యలు తీసుకోండి

- ఎస్పీకి బాధితుల వినతి
- చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైమ్): వర్క్ ఫ్రమ్ హోమ్, ఎయిమ్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, అధిక లాభాలు వస్తాయని, ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని రూ.లక్షలు దోచేసిన మోసగాళ్లపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఎస్పీ చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దాదాపు 80 మంది ఎస్పీకి ఫిర్యాదులు అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ ఆయా ప్రాంత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ చెంచురామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులరెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రంహోమ్ పేరుతో..

టెలిగ్రామ్‌లో శరణ్య అనే మహిళ పరిచయం అయింది. ట్రావెల్ కంపెనీలో (వర్క్‌ఫ్రం హోమ్) ఉద్యోగం ఇప్పిస్తానని, రూ.21 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని నమ్మించింది. దీంతో నగదు చెల్లించాక నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ పంపి మోసగించింది. నిందితురాలిపై చర్యలు తీసుకోవాలని అల్లూరుకు చెందిన ఓ వ్యక్తి కోరారు.

అధికలాభాలొస్తాయని..

ఫేస్‌బుక్‌లో పరిచయం అయిన ఓ వ్యక్తి ఓప్రైవేట్ కంపెనీకి చెందిన ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నగదు ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని నమ్మించడంతో రూ.21.50 లక్షలు కట్టా. అనంతరం సంస్థకు చెందిన అకౌంట్ ఫ్రీజ్ చేశారని చెప్పారు. బ్యాంకును సంప్రదించగా అంతా మోసమని తేలింది. విచారించి న్యాయం చేయాలని వేదాయపాళెంకు చెందిన ఓ వ్యక్తి కోరారు.

నకిలీ పత్రాలు సృష్టించి..

నెల్లూరు నగరానికి చెందిన మంజుల, శివకుమార్, రజనీ గ్రూప్‌గా ఏర్పడి వైఎస్సార్‌నగర్‌లో ప్లాటు ఇప్పిస్తానని నకిలీ పత్రాలు సృష్టించి రూ.5.65 లక్షలు తీసుకుని మోసగించారు. వారిపై చర్యలు తీసుకోవాలని వేదాయపాళెంకు చెందిన ఓ మహిళ కోరారు.

కాపురాన్ని చక్కదిద్దండి

మనస్పర్థల నేపథ్యంలో నన్ను, నా పిల్లలను భర్త పట్టించుకోకుండా ఇంటి నుంచి గెంటేశారు. నా భర్తకు కౌన్సెలింగ్ చేసి నా కాపురాన్ని చక్కదిద్దాలని రాపూరుకు చెందిన ఓ మహిళ కోరారు.

మెడికల్ సీట్ ఇప్పిస్తానని..

హరనాథపురానికి చెందిన విజయ్‌కుమార్ కర్ణాటకలో మెడికల్ సీటు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో రూ.24 లక్షలు ఇచ్చాను. అప్పటి నుంచి సీటు ఇప్పించకపోగా నగదు తిరిగి ఇవ్వమంటే బెదిరింపు చర్యలకు దిగాడు. మాలాగే అనేక మందిని అతను మోసగించాడని, నెల్లూరు దర్గామిట్ట, వేదాయపాళెం పోలీసుస్టేషన్లలో కేసులున్నాయని తేలింది. మోసగాడిపై చర్యలు తీసుకోవాలని బాలాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కోరారు.

ఎయిమ్స్‌లో ఉద్యోగం కల్పిస్తామని..

హైదరాబాద్‌కు చెందిన అమీయ్‌మియా అతని భార్య నా కుమారుడికి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.13.60 లక్షలు నగదు తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో గట్టిగా నిలదీశాను. ఐదు నెలల నుంచి ఇబ్బంది పెడుతున్నారు. వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని నెల్లూరు రూరల్‌కు చెందిన ఓ మహిళ కోరారు.

బీపీసీఎల్‌తో పర్యావరణానికి ప్రమాదం



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ రైతులు, నాయకులు

- భూములివ్వమని చేవూరు గ్రామ ప్రజల ఉద్ఘాటన

కందుకూరు: పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూర్చే బీపీసీఎల్ పరిశ్రమకు తాము భూములివ్వమని గుడ్లూరు మండలంలోని చేవూరు గ్రామానికి చెందిన రైతులు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. గతంలో ఇండో సోలార్ కంపెనీ పేరుతో తమ గ్రామ పరిధిలో భూములు సేకరించారని, ప్రస్తుతం ఆ భూములను బీపీసీఎల్ కంపెనీకి కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గ్రామానికి చుట్టు పక్కల ఉన్న దాదాపు 1300 ఎకరాల భూములను ఇండో సోలార్ కంపెనీ కోసం సేకరించారని, ఆ సమయంలో అధికారులు ఐదు వేల ఎకరాల కావాలని చెప్పారన్నారు. సోలార్ కంపెనీ వస్తే భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. దీంతో రైతులు అందరూ కంపెనీ వస్తే భూములు విలువ పెరగడంతో పాటు, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయనే, ప్రాజెక్టు వల్ల ఎటువంటి పర్యావరణ సమస్యలు రావనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా భూములివ్వడానికి ముందుకు వచ్చారన్నారు.

తాగు, సాగునీటికి ఇబ్బందులు

సోలార్ కంపెనీకి కేటాయించిన భూములను బీపీసీఎల్‌కు కేటాయించే పనుల్లో అధికారులు ఉన్నారని, బీపీసీఎల్ వల్ల భూగర్భ జలాలు కలుషితమై తాగునీటికి, సాగునీటికి ఇబ్బందుల వస్తాయన్నారు. ఊళ్లకు ఊళ్లే ఖాళీ చేసే పరిస్థితులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా పొలాలు కోల్పోయిన రైతులు, కూలీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున బీపీసీఎల్ ప్రాజెక్టుకు భూములు కేటాయించొద్దని విన్నవించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు నక్కా శరత్ యాదవ్, సాయిశంకర్, ఎస్ విష్ణు, ఆర్ రామకృష్ణ, డి సురేష్, కె సునీల్, ఎస్‌రాము, పత్రే సుబ్బారాయుడు, నకాక హరినాథ్, యు సుబ్బారావు, వీ శ్రీను, ఆర్ పాపారావు, ఆర్ చెంచురామారావు, ఎస్ రమేష్, ఎన్ ఏసురత్నం, సీహెచ్ మోహన్, పి అనిల్, పి రవి, ఎల్ హరిబాబు, జి పేతురు, వై శ్రీను, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిశోర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాశం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాదారుడి అరెస్ట్

- 10 కేజీల గంజాయి స్వాధీనం



నిందితుడితో రైల్వే పోలీసులు

నెల్లూరు (క్రైమ్): గంజాయి అక్రమ రవాణాదారుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 10 కేజీల గంజాయిని సోమవారం రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు రైల్వే పోలీసుస్టేషన్‌లో రైల్వే సీఐ కె. భుజంగరావు నిందితుడి వివరాలను వెల్లడించారు. నేర నియంత్రణ చర్యల్లో భాగంగా రైల్వే పోలీసులు రైళ్లు, రైల్వేస్టేషన్లలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా, రెండు, మూడో ప్లాట్‌ఫాంల మధ్యలో అనుమానాస్పదంగా ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా బురుగుబయలు గ్రామానికి చెందిన పి. సన్యాసిరావును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా రెండు కేజీల బరువు కలిగిన ఐదు గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రైల్వే పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించగా బెంగళూరు, చెన్నైల్లోని వ్యక్తులకు ఇచ్చేందుకు వెళుతున్నామని చెప్పారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిపై రంపచోడవరంలో గంజాయి కేసు ఉందని సీఐ చెప్పారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్‌ఐ మాలకొండయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (అర్బన్): కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు వచ్చి అందజేసే అర్జీదారుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ప్రజల అందజేసిన అర్జీల విషయమై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు 456 అర్జీలు ప్రజలు అందజేశారన్నారు. అత్యధికంగా రెవెన్యూలో 202 వచ్చాయన్నారు. పోలీసు శాఖలో 51, మున్సిపల్ శాఖలో 33, సర్వే శాఖలో 31, పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 35 అర్జీలు వచ్చాయన్నారు. మిగతావి ఇతర విభాగాలకు చెందినవన్నారు. ప్రతి వారం ఎందుకు ఈ స్థాయిలో అర్జీలు వస్తున్నాయని ప్రశ్నించారు. వచ్చిన అర్జీలే, తిరిగి వస్తున్నాయని, దీనికి కారణం మీ స్థాయిలోనే నిర్లక్ష్యం ఉందని స్పష్టమవుతుందన్నారు. ఇకపై ప్రతి వారం వచ్చే అర్జీలు నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, లేని పక్షంలో అందుకు గల కారణాలు వివరించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్‌తోపాటు జెడ్పీ సీఈఓ విద్యారమ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



- బ్రాయిలర్ (లైవ్) : 90
- లేయర్ (లైవ్) : 75
- బ్రాయిలర్ చికెన్ : 168
- బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 188
- లేయర్ చికెన్ : 127

నిమ్మధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ .47
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.22

